



ప్రసన్నయ్యగారిపల్లె వద్ద జలహారతి ఇచ్చి పూజలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి



నేతిగుట్లపల్లె పంప్ హౌస్ నుంచి దుముకుతున్న కృష్ణాజలాలు

కృష్ణా జలాల పరవళ్లు

పుంగనూరు వద్ద ప్రజలతో కలసి స్వాగతం పలికిన మంత్రి

పుంగనూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):జిల్లాకు చేరుతున్న కృష్ణా జలాలతో తాగు,సాగు నీటి కష్టాలు తీరనున్నాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.పుంగనూరు సమీపంలోని ప్రసన్నయ్యగారిపల్లె వద్ద టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి హంద్రీనీవా కాల్వలో కృష్ణా జలాలకు పూజలు చేసి హారతి ఇచ్చారు.సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మీదుగా కుప్పానికి కృష్ణాజలాలు తీసుకొస్తున్నారని చెప్పారు. వైసీపీ నేతలు ఉనికి కోసం సూపర్‌సిక్స్ అమలు చేయలేదని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, నిజానికి అంతకు మూడింతల అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పుంగనూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు,హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్ఈ విఠల్‌ప్రసాద్, ఈఈ నీలకంఠారెడ్డి, డీఈ రాయల్ బాబు రాజేంద్రప్రసాద్, రవికుమార్, టీడీపీ నాయకులు శమీపతి, శ్రీకాంత్, సీవీరెడ్డి, గువ్వల రమేశ్ రెడ్డి, దినేశ్, వెంకటమునియాదవ్, పోలీస్‌గిరి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పలమనేరు నియోజకవర్గంలోకి ప్రవాహం

హంద్రీనీవా కాలువ ద్వారా పరవళ్లు తొక్కుతూ కృష్ణాజలాలు శుక్రవారం పుంగనూరు మండలం నుంచి పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలంలోకి పారాయి. ఉదయం 7గంటల ప్రాంతంలో పుంగనూరు మండలంలోని ఈడిగపల్లె , చిలకవారిపల్లె మీదుగా నేతిగుట్లపల్లె లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌కు కృష్ణాజలాలు చేరాయి. హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ విఠల్‌కుమార్ ఆదేశాలతో లిఫ్ట్ ద్వారా నాలుగు పైపులకు గానూ రెండుపైపుల్లో నీటిని విడుదల చేశారు. శుక్రవారం పుంగనూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన ఉండడంతో జలహారతి ఇప్పించారు. పుంగనూరు మండలం ప్రసన్నయ్యగారిపల్లె, మార్లపల్లె, మాదనపల్లె మీదుగా నీరు పరవళ్లు తొక్కుతూ పెద్దపంజాణి మండలంలోకి ప్రవేశించాయి.కాగా ఉదయం నుంచి హంద్రీనీవా కాల్వల ప్రాంతానికి ప్రజలు వెళ్లి కృష్ణాజలాలకు పూజలు చేశారు.తాగు,సాగు నీటి కష్టాలు తీర్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

- విద్యాశాఖ, అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు అనుమతి
- సబ్జెక్టుల వారీగా జిల్లా టాపర్లు

వివరాలు 6వ పేజీలో

కార్మికశాఖ జేసీ ఇంట్లో ఏసీబీ తనిఖీలు

- పలు రికార్డులు, భూమి పత్రాలు, నగదు స్వాధీనం
- నేడూ కొనసాగనున్న సోదాలు



బాలునాయక్ ఇంట్లో తనిఖీలు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో కర్నూలు కార్మికశాఖ జాయింట్ కమిషనరు (జేసీ) బాలు నాయక్ ఇంట్లో శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతిలోని రాఘవేంద్రనగర్‌లో ఈయన నివాసం ఉంటున్నారు. ఈ ఇంటితో పాటు కర్నూలులోని కార్యాలయం, అద్దె ఇల్లు, కుటుంబీకులు, బంధువుల ఇళ్లు, అన్నమయ్య జిల్లాలోని పౌల్ట్రీ ఫారంతో పాటు తొమ్మిది ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేశారు. తిరుపతిలోని ఇంట్లో తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. బాలునాయక్ కుమారుడు నిర్వహిస్తున్న ఆర్‌సీ సర్జికల్ షాపులోనూ తనిఖీలు చేశారు. ఇంట్లో పలు కీలక రికార్డులు, బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆయన స్వగ్రామమైన రాయచోటి సమీపంలోని బిడికి తాండా, రాయచోటి, మదనపల్లె, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇళ్లు, అపార్టుమెంట్లు, పౌల్ట్రీ ఫారాలు, భూములకు సంబంధించి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సంబేపల్లిలో ఆయనకు పౌల్ట్రీఫారం ఉన్నట్లు గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల గురించీ ఆరా తీశారు. కర్నూలు కేంద్రంగా కార్యాలయం వున్నప్పటికీ తిరుపతిలోని ఇంటి నుంచే అన్ని కార్యకలాపాలు నిర్వహించే వారని ఆరోపణలున్నాయి. కాగా, స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్లు, కీలక రికార్డులనులోతుగా పరిశీలిస్తున్నారు. ఈ సోదాలు శనివారం కూడా కొనసాగనున్నాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ చెప్పారు.



పుత్తూరులోని నారాయణస్వామి ఇంటి ముందు సందడి

ఇంటిముందు సిట్ సిబ్బంది భద్రత

మాజీ డిప్యూటీ సీఎం ఇంటి తలుపుతట్టిన సిట్

- లిక్కర్ స్కామ్ కేసులో ఏడు గంటలపాటు విచారణ
- ఇప్పటికే జైల్లో మిథున్, చెవిరెడ్డి
- నారాయణస్వామినీ అరెస్టు చేస్తారనే ప్రచారం
- వైసీపీ వర్గాల్లో గుబులు



సిట్ విచారణానంతరం మీడియాతో మాట్లాడుతున్న నారాయణస్వామి

తిరుపతి/పుత్తూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు చేపట్టిన సిట్ బృందం తాజాగా అప్పటి ఎక్సైజ్ మంత్రిగా పనిచేసిన మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఇంటి తలుపు తట్టింది. ఏడు గంటల పాటు సుదీర్ఘంగా విచారించింది. విజయవాడకు వచ్చి విచారణకు హాజరు కావాలని ఇదివరకే సిట్ అధికారులు నారాయణస్వామికి నోటీసు ఇచ్చారు. వయోభారం, అనారోగ్యాల కారణంగా విజయవాడ రాలేనని చెప్పడంతో విజయవాడ నుంచే టెలి కాన్ఫరెన్సు ద్వారా విచారించారు. మళ్లీ విచారణకు హాజరు కావాలని రెండోసారి నోటీసు ఇవ్వగా, నారాయణస్వామి నుంచి స్పందన లేదు. దీంతో సిట్ బృందం శుక్రవారం ఉదయం 11 గంటలకు పుత్తూరు చేరుకుని మాజీ మంత్రి ఇంటి తలుపు తట్టింది. ఇదివరకు తిరుపతి జిల్లా ముఖ్య అధికారిగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో నలుగురు డీఎస్పీ స్థాయి అధికారులు నారాయణస్వామిని ప్రశ్నించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన మొదలుకుని, అమలు, అవకతకల వరకూ పలు అంశాలపై లోతుగా విచారించారు. మరోవైపు లిక్కర్ స్కామ్ దర్యాప్తులో ఉపకరిస్తాయన్న ఉద్దేశంతో నారాయణస్వామి ల్యాప్‌టాప్‌ను, మొబైల్ ఫోన్‌ను సిట్ అధికారులు సీజ్ చేశారు. దీనికోసం పంచనామాకు వీఆర్వోలను పిలిపించగా, అరెస్టు చేస్తారనే ప్రచారం జోరుగా సాగింది. ఈ కుంభకోణంలో ఇప్పటికే జిల్లాకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టయి జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. వైసీపీలో వీరిద్దరూ బలమైన నేతలు. వైసీపీ అధినేత జగన్‌కు సన్నిహితులుగా ముద్ర పడ్డారు. గత ప్రభుత్వంలో బాగా అధికారం కూడా చెలాయించారు. వారిద్దరి అరెస్టు నేపథ్యంలో అదే శాఖకు మంత్రిగా పనిచేసిన నారాయణస్వామి ఇంటికి సిట్ అధికారులు రావడంతో ఆయన్నూ అరెస్టు చేస్తారనే వైసీపీ వర్గాలు భావించాయి. ఈ పరిణామం ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గాల్లో గుబులు పుట్టించింది.

తొంగి చూడని వైసీపీ నేతలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో.. కేసు ఏదైనా వైసీపీ నేతల అరెస్టు లేదా విచారణలను ఎదుర్కొనే క్రమంలో ఆ పార్టీ నేతలు మద్దతుగా వెళ్లడం, పోలీసు అధికారులకు అడ్డుపడిన సంఘటనలు అనేకం జరిగాయి. అయితే పుత్తూరులో శుక్రవారం సిట్ అధికారులు నారాయణస్వామిని ప్రశ్నించేందుకు వచ్చిన సందర్భంలో ఓ స్థాయి నాయకులు కూడా ఆయన ఇంటి వైపు తొంగి చూడలేదు. ఆయన నివాసమున్న పుత్తూరు పట్టణం.. నగరి నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. మాజీ మంత్రి రోజాకు, ఈయనకు ఓ విధంగా చెప్పాలంటే విభేదాలున్నాయి. దాంతో స్థానిక వైసీపీ నేతలు, శ్రేణుల నుంచి ఆయనకు ఎలాంటి మద్దతూ లభించలేదు. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలుసుకుని జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచీ పదుల సంఖ్యలో కార్యకర్తలు మాత్రమే వచ్చారు. జిల్లాలో ఒకరొకరుగా నేతలు జైలుపాలవుతుండడం, కేసుల్లో చిక్కుకుంటుండడంతో వైసీపీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం సడలుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

తీరని యూరియా కష్టాలు





చిత్తూరులో సీడీసీఎంఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. వర్షాలు విస్తారంగా కురవడంతో రైతులు వరి సాగుపై దృష్టి సారించారు.ఇందుకు అవసరమైన యూరియా కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు. అవసరమైన మేరకు యూరియా నిల్వలు లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు విక్రయ కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరుతున్నారు. జిల్లాకు 26,793 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటి వరకు 13,800 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరింది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద 2 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా, మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలో యూరియా కొరత తీరాలంటే మరో 10 వేల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉంది.కాగా చిత్తూరులోని మార్క్‌ఫెడ్ వద్ద 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉండగా, గాంధీ రోడ్డులోని సీడీసీఎంఎస్‌కు 20 మెట్రిక్ టన్నులు అంటే 450 బస్తాలు ఇచ్చారు.వీటికోసం పెద్దసంఖ్యలో రైతులు సీడీసీఎంఎస్ వద్ద శుక్రవారం ఉదయం నుంచే పడిగాపులు కాశారు. ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు నిరాశ వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి బాలవీరాంజనేయ స్వామి, సినీ నిర్మాత డీవీవీ దానయ్య, ఎస్పీఎఫ్ డీజీ అధికారి త్రివిక్రమ్ వర్మ, డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ(ఎస్‌సీఓడీ) సభ్యులు, ఎంపీలు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్


బ్రహ్మోత్సవాలొస్తున్నాయ్
రిపేర్లు పూర్తి చేయండి

● తిరుమలలో వసతిపై ఈవో సమీక్ష

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న అన్ని వసతి గదుల్లో రిపేర్లను సకాలంలో పూర్తిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం అధికారులతో వసతి, ఇతర సౌకర్యాలపై ఈవో సమీక్షించారు. లడ్డూప్రసాద విక్రయ కేంద్రంలోని అన్ని కౌంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. రాష్ట్ర ఆహార భద్రతాధికారులతో తిరుమలలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహార నాణ్యతను నిరంతరం పరిశీలించాలని, హోటళ్లలో సంప్రదాయ భోజనం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.



సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,112
తలనీలాలు సమర్పించినవారు: 27,331

ఘల్లుమంది జానపదం





రవి కుల తిలకా రారా.. అంటూ శ్రీరాముడిని స్తుతిస్తూ సాగిన చెక్కభజన, హే బాపూ బంజారోళ్లం.. అంటూ గిరిజన సంస్కృతిని ప్రతిబింబించిన జానపదం, వస్తావా జానకి కోడిపందేమో నువ్వు.. అంటూ ప్రేమికుల మధ్య ప్రణయాన్ని తెలియజేసే జానపద నృత్యం. ఇలా.. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగిన జానపద కళారూపాల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మన సంస్కృతి, సంప్రదాయాలు ఇమిడిఉన్న జానపద కళలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే తరానికీ అందించాలని ఎస్వీయూ వీసీ అప్పారావు సూచించారు. రాయలసీమ, చిత్తూరు ప్రాంతానికే ప్రత్యేకమైన కొన్ని జానపద కళలు ఉన్నాయని, ఇలాంటి విలువైన కళలను కాపాడుకోవాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. జానపద విజ్ఞానంలో జానపద సంగీతం, జానపద నృత్యానికి ప్రత్యేక స్థానం ఉందని పద్మావతి వర్సిటీ సంగీత-నృత్య విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. చెక్క భజన, కోలాటం పాటల్లో మన సంస్కృతి ఉందని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ చెప్పారు. విద్యార్థుల్లో జానపదం పట్ల మక్కువ కలిగించడానికి.. వారిలో జానపద విజ్ఞానాన్ని వెలికి తీయడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి చెప్పారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి











కొండను ఢీకొన్న టెంపో - ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు
స్వల్పగాయాలతో బయటపడిన భక్తులు

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. భక్తులందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నారావారిపల్లెకు చెందిన కొందరు దర్శనం తర్వాత శుక్రవారం కారులో తిరుపతికి వస్తుండగా 26వ మలుపువద్ద వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అలాగే సాయంత్రం మొదటిఘాట్‌రోడ్డులోని చివరిమలుపు వద్ద ఓ టెంపో ట్రావెలర్ వాహనం అదుపుతప్పి కొండను ఢీకొంది. విజయవాడకు చెందిన 10 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు.

భక్తితో భద్రతా బాధ్యతలు

● సిబ్బందితో ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ్ వర్మ



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): భద్రతా వైఫల్యాలకు తావులేకుండా తిరుమలలో విధులు నిర్వహించాలని ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ్ వర్మ ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సెప్టెంబరు 24 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో భద్రతా జాగ్రత్తలపై తిరుపతిలోని శ్వేతభవనంలో శుక్రవారం ఎస్పీఎఫ్ సిబ్బందితో డీజీ సమావేశమయ్యారు.. టీటీడీలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతం. భక్తి, అంకిత భావంతో, విచక్షణతో, క్రమశిక్షణతో భక్తులను మెప్పించే విధంగా భద్రతా సిబ్బంది సేవలందించాలన్నారు. హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోట్ అయిన 1998 బ్యాచ్ కానిస్టేబుళ్లను అభినందించారు.

నేడు హథీరాంజీ మఠం భవనం పరిశీలన

తిరుపతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం ప్రధాన కార్యాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, మఠం ఇంచార్జి ఈవో బాపిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించనున్నారు. ఈ బృందంతో పాటు తిరుపతి ఐఐటీ నుంచీ సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు రానున్నారు. గత మంగళవారం కలెక్టరేట్‌లో మఠం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, షాపుల నిర్వాహకులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అందరితో కలసి ప్రత్యక్షంగా మఠం భవనాన్ని పరిశీలించాలని, భవనం పటిష్టతను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవాలని నాడు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానికనుగుణంగా శనివారం ఉదయం 11 గంటలకు మఠం భవనం వద్దకు రానున్నారు. కాగా, శిథిలావస్థకు చేరిన ఈ పురాతన భవనాన్ని తిరుపతి ఐఐటీ నిపుణులు సైతం పరిశీలించి నివాస యోగ్యం కాదని, కూల్చివేతకు సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చారు. దీంతో కూల్చివేతకు దేవదాయశాఖ టెండర్లు కూడా పిలిచింది. ఆ దశలో ఈ వివాదం రాజకీయ మలుపు తీసుకోవడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆచితూచి అడుగులేస్తున్నారు. భవనం కూల్చివేస్తే తిరిగి కొత్త భవనాన్ని నిర్మించే విషయమై దేవదాయ శాఖ నుంచీ స్పష్టత తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు భవనాన్ని కూల్చకుండా వారసత్వ కట్టడంగా కొనసాగించేందుకు అందుబాటులో వున్న అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. ఆ మేరకు పురావస్తు శాఖ, తిరుపతి ఐఐటీ, సెంట్రల్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ తదితర సంస్థలకు కూడా లేఖలు రాశారు. మొత్తానికీ శనివారం ఈ భవనాన్ని పరిశీలించాక ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై నగరవాసుల్లో ఆసక్తి నెలకొంటోంది.

వందశాతం.. అడ్మిషన్లు, ఉత్తీర్ణత

ఇదే లక్ష్యంతో పనిచేయాలంటూ సంక్షేమ హాస్టళ్ల అధికారులకు మంత్రి డోలా సూచన

తిరుపతి(జీవకోన), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో వందశాతం ప్రవేశాలు.. ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి సూచించారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన రీజనల్ కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. 'వసతి గృహాల మరమ్మతులకు రూ.143కోట్లు, నూతనంగా నిర్మించే హాస్టల్ భవనాలకు రూ.100కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.50కోట్లు విడుదల చేశాం. వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వసతి గృహ విద్యార్థులకు నవోదయ, గురుకుల పాఠశాలల్లో.. ఎంసెట్ ప్రవేశ పరీక్షలను రాసేలా అధికారులు సన్నద్ధం చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్‌పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తిరుపతి కలెక్టర్ ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వారిచే తమ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకోవడం శుభపరిణామన్నారు. సంక్షేమ శాఖలోని డీడీలు, డీఎస్‌డబ్ల్యూవో, ఎస్‌డబ్ల్యూవో, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పనితీరు మార్చుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేస్తూ, విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తప్పనిసరిగా రాత్రి బస చేయాలని సూచించారు. వసతిగృహాల నిర్వహణ, విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై అవగాహన కల్పించడం కోసమే ఈ కాన్ఫరెన్సు ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి తెలిపారు. తిరుపతి జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ తరపున శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి మానసికంగా, శారీరకంగా బలోపేతం చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మొదటి దశలో 11వేల మంది విద్యార్థులు, 250మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న మంత్రి, కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్

జర్మనీలో నర్సింగ్ అవకాశాలు

నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. తిరుపతిలోని బాబు జగజీవన్‌భవనందు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణను ఆయినన ప్రారంభించారు. జర్మన్‌భాషపై నర్సింగ్ విద్యార్థులు పట్టు పెంచుకోవాలని సూచించారు. జర్మన్‌భాషపై పట్టు సాధించడానికి ఉచితంగాశిక్షణ ఇచ్చి అర్హత సాధించేలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, కలెక్టర్ వెంకటేశ్వర్, నైపుణ్యాభివృద్ధి శాఖ ఈడీ మధుసూదన్, డైరెక్టర్ లావణ్యవేణి, విక్రమ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీట్ పీజీలో మెరిసిన తిరుపతి కుర్రోడు సాయినితేష్

● ఆలిండియాస్థాయిలో 136వ ర్యాంకు కైవసం



తిరుపతిరూరల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి నీట్ పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుచానూరు వీవీ లేఅవుట్‌కి చెందిన డాక్టర్ గండికోట సాయినితేష్ అత్యుత్తమ ప్రతిభ చాటి ఆలిండియా136వ ర్యాంకుని కైవసం చేసుకున్నాడు. ఈనెల 3న నిర్వహించిన ప్రవేశపరీక్షా ఫలితాలను ఇదే నెల 19న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో సాయినితేష్ 136వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. ఈ విద్యార్థి తిరుపతిలోని ఎస్వీమెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని టాప్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో జనరల్ మెడిసిన్‌ని అధ్యయనం చేస్తానని అంటున్నాడు. కాగా ఈయన స్నేహలత, శ్రీధర్ (విద్యుత్‌శాఖలో డీఈఈ) దంపతుల కుమారుడు. చెల్లెలు జాహ్నవి పద్మావతి మెడికల్ కళాశాల (స్విమ్స్)లో ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు.

మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నిషిధరాజు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో మరికొందరికి చోటు



నిషిధరాజు - అశోక్‌రాజు - కోలా ఆనంద్ - సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

పుత్తూరు/శ్రీకాళహస్తి/తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నిషిధరాజును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. పుత్తూరులోని బీజేపీ కార్యాలయంలో స్వీట్లు పంచారు. పుత్తూరుకు చెందిన ఈమె 14 ఏళ్లుగా బీజేపీలో వివిధ పదవుల్లో పనిచేశారు. 2019లో నగరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి మహిళలను జాగృతం చేస్తానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేస్తానన్నారు. ● ఇక, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల యజమాని డాక్టర్ కొండూరు అశోక్‌రాజు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ కోలా ఆనంద్ నియమితులయ్యారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వీరు ప్రకటించారు. ఇక, నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

● విద్యాశాఖ, అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు అనుమతి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితాను విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టుల భర్తీకి గాను 21,340 మంది అభ్యర్థులు పరీక్షలకు అర్హత సాధించారు. జూన్ ఐదు నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 19,550మంది హాజరయ్యారు.

సబ్జెక్టులవారీగా ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్లు వీరే..

స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజస్ కేటగిరీలో.. : స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)లో ఎస్.సాదియా 87.24 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 31.93గా చూపారు. మొత్తం 1190 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (హిందీ)లో బురదగుంట బావాజీ 83.53 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచాడు. చివరి స్కోర్ 26.27గా చూపారు. మొత్తం 628 మందితో మెరిట్ జాబితాను ఇచ్చారు. ● స్కూల్ అసిస్టెంట్ (తమిళం)లో కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. 65.07 స్కోర్‌తో జి.నందిని మొదటి స్థానంలో 42.63 స్కోర్‌తో ఎం.సెల్వరాజ్ రెండో స్థానంలో నిలిచారు. ● స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో ఎస్.విజయ్ 87.01 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలవగా, చివరి స్కోర్ 23.63గా చూపారు. మొత్తం 1594 మందితో మెరిట్ జాబితా ఇచ్చారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)లో వి.సయ్యద్ షాహినూర్ 84.93 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 30.23గా చూపారు. మొత్తం 95 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు

స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజస్ కేటగిరీలో.. : స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్)లో కె.అబ్దుల్ రహమాన్ 84.49 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలవగా.. చివరి స్కోర్‌గా 25.91 చూపారు. మొత్తం 1,890 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్- తమిళ మీడియం)లో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. రవిబాబు ప్రీతి 69.17 స్కోర్‌తో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. చివరిగా 33.83 స్కోర్‌తో ఎన్.ధనలక్ష్మి నిలిచారు. ● స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్-ఉర్దూ మీడియం)లో ఎం.ఎస్.సబీనా రహమతున్నీసా 65.10 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 37.53గా చూపారు. మొత్తం 16 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్)లో జి.సురేఖ 88.80 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.44గా చూపారు. మొత్తం 2238 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్-తమిళ మీడియం)లో జి.తమిళ్‌సెల్వి 66.10 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 29.30గా చూపారు. 33 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్- ఉర్దూ మీడియం)లో ఎస్.మహ్మమద్ జిలానీ 67 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 31.47గా చూపారు. మొత్తం 38 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లో ఎం.నవీన్ కుమార్ 91 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.5గా చూపారు. మొత్తం 807 మంది మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)లో జి.రాజేష్‌కుమార్ 78.08 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 30.47గా చూపారు. మొత్తం 666 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)లో ఎం.సురేష్‌కుమార్ 86.68 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 19.26గా చూపారు. మొత్తం 4441 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్-తమిళ మీడియం)లో పీఎస్ తులసీరామన్ 67.47 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 32గా చూపారు. 33మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ●స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్-ఉర్దూ మీడియం)లో షేక్ మౌలాలీ 65.52స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు.చివరి స్కోర్ 29.77గా చూపారు. 76మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు.

ఎస్జీటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్లు వీరే...

సెంకడరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ)లో ఎం.ఉషారాణి 94.62 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.04గా చూపారు. మొత్తం 15,215 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● ఎస్జీటీ-తమిళ మీడియంలో పీఎం హేమలత 72.90 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 31.17గా చూపారు. మొత్తం 90 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● ఎస్జీటీ- ఉర్దూ మీడియంలో షేక్ అఫ్రీన్ తాజ్ 83.03 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 27.40గా చూపారు. మొత్తం 406 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు.

జోన్లవారీగా పీజీటీ మెరిట్ జాబితా

జోన్లవారీగా పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఇందులో పీజీటీ- ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, తెలుగుతోపాటు ఇంగ్లీష్ మీడియంకు సంబంధించి బయోసైన్స్, బోటనీ, సివిక్స్ కామర్స్ ఎకనామిక్స్ మ్యాథమెటిక్స్ ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయాలజీ సబ్జెక్టులు ఉన్నాయి. వీటితోపాటు స్టేట్ ప్రిన్సిపాల్ పోస్టుల మెరిట్ జాబితా సైతం విడుదల చేశారు.

పెద్దిరెడ్డికి రైతుల ఉసురే తగిలింది

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



పసుపుమయమైన పుంగనూరు



ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న శమిపతియాదవ్‌తో మంత్రి రాంప్రసాద్, చల్లా బాబు తదితరులు



టీడీపీ నేతలతో ట్రాక్టర్ ఎక్కిన మంత్రి

పుంగనూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలు,అక్రమాలు,దౌర్జన్యాలు, దోపిడీలతో చెలరేగిపోయిన పెద్దిరెడ్డి కుటుంబానికి రెండేళ్లకే దేవుడు వడ్డీతో పాటు శిక్ష విధించాడని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పుంగనూరులో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సరిగ్గా రెండేళ్ల క్రితం ప్రతిపక్ష నేతగా చంద్రబాబు జిల్లాకు వస్తుంటే అంగళ్లు వద్ద దాడి చేయించడమే కాక పుంగనూరులోకి రానియ్యమంటూ పోలీసులను అడ్డంపెట్టుకుని తనతో పాటు వందలాదిమంది టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టించారని గుర్తుచేశారు. రాష్ట్రమంతా లీటరు పాలు రూ.26 అమ్ముతుండగా, పెద్దిరెడ్డి డెయిరీలో మాత్రం రూ.18 ఇచ్చారనిరైతులకు పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టి వేధించడం, పీఎల్ఆర్ లారీల్లో ఇసుక బయట రాష్ట్రాలకు పంపడం జనాలింకా మరిచిపోలేదని దుయ్యబట్టారు. చివరకు ఆ రైతుల ఉసురు తగిలే పెద్దిరెడ్డి నిద్రలేని రాత్రులు గడుపుతుండగా , ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి జైలుపాలయ్యారన్నారు. రాక్షస పాలకుడైన జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రానికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుపై వైసీపీ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయడంలేదన్నారు.టీడీపీ మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు,జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఉయ్యాల రమణ, రాందాస్ చౌదరి, పగడాల రమణ, సీవీరెడ్డి, మాధవరెడ్డి, శ్రీకాంత్, నాగరాజయాదవ్, గువ్వల రమేశ్‌రెడ్డి, పతిరాజు, గంగాధర్, కోలాట వెంకటరమణ, కుమార్, రాఘవ, రెడ్డెప్పనాయుడు, శంకర్, సుబ్రహ్మణ్యం, సుహేల్, రామకృష్ణరాజు, చంద్ర, ప్రసాద్, విరూపాక్షి, చైతన్యరాయల్, చిన్నరాయులు, జగదీష్ రాజు, పులి నరేంద్ర, మదన్‌మోహన్, బాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా శమిపతి ప్రమాణస్వీకారం

పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నల్లబాల శమిపతియాదవ్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో చైర్మన్‌గా ఎన్. శమిపతియాదవ్, వైస్ చైర్మన్‌గా వెంకటరమణ, డైరెక్టర్లుగా శాంతమ్మ, చంద్రమ్మ, జయశ్రీ, సుధాకర రెడ్డి, అమరనాథనాయుడు, మసెన్న, చంద్రమ్మ, అరుణ, మంజునాథ్, ఆసీఫ్‌బాషా, శ్రీదేవి, పాపులమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే సింగిల్‌విండో చైర్మన్‌గా పగడాల రమణ, డైరెక్టర్లుగా కోలాట వెంకటరమణ, శ్రీనాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.అంతకుముందు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో పుంగనూరుకు చేరుకుని ఇందిరా సర్కిల్ వద్ద మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి ఘనస్వాగతం పలికారు. ట్రాక్టర్ ఎక్కిన మంత్రి డ్రైవింగ్ సీటులో కూర్చుని ర్యాలీ ప్రారంభించారు. గిరిజన మహిళల నృత్యాలు, కోలాటాలు, చెక్కభజనల మధ్య కోలాహలంగా మార్కెట్ యార్డు వరకు ర్యాలీ సాగింది.





టీటీడీ ఈవో శ్యామలరావుకు ఆహ్వానపత్రిక ఇస్తున్న ఈవో పెంచలకిషోర్ - ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కాణిపాక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని శుక్రవారం టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరిని ఆలయ ఈవో పెంచలకిషోర్, ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆహ్వానించారు. ఈనెల 27 నుంచి సెప్టెంబరు 16వ తేదీవరకు నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఐరాల టీడీపీ అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, మాజీ చైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేసిన ఈవో

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆలయ ఈవో పెంచలకిషోర్ ఆహ్వానించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని చేపట్టిన ఏర్పాట్లపై వివరించారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పెంచలకిషోర్

టీటీడీ ప్రతిష్టను దిగజార్చిన వైసీపీ మూల్యం చెల్లించుకుంది : గౌనివారి

రామకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా టీటీడీ ప్రతిష్టను దిగజార్చిన వైసీపీ అందుకు తగిన మూల్యం చెల్లించుకుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీడీ చైర్మన్లుగా కరుణాకర రెడ్డి, వైవీసుబ్బారెడ్డి హయాంలో టీటీడీలో అక్రమాలు, అవినీతి రాజ్యమేలాయన్నారు. కరుణాకర రెడ్డి హయాంలో ప్లాస్మా టీవీలు, తాళిబొట్లు, అభిషేకం, తలనీలాలు, స్వామి వారి డాలర్ల కుంభకోణాలతోపాటు ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సుబ్బారెడ్డి చైర్మన్‌గా ఉన్నపుడు వ్యాపార, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలే ధ్యేయంగా దర్శన టిక్కెట్లు కేటాయించారన్నారు.2022లో జగన్ చేసిన నిర్వాకానికి ప్రస్తుతం టీటీడీ రూ.140 కోట్ల వడ్డీ కడుతోందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ముఠాలు రోజుకు 5వేల వీఐపీ టిక్కెట్లను అమ్ముకున్నాయన్నారు. టీటీడీ నిధులతో తన రియల్ ఎస్టేట్ వెంచర్లకు రోడ్లు వేయించుకున్న దుర్మార్గుడు కరుణాకర రెడ్డి అని ఆరోపించారు.జగన్, అతని హిందూ వ్యతిరేక గుంపు టీటీడీపై దాడులకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

అపర భగీరథుడు సీఎం చంద్రబాబు

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అపర భగీరథుడని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈనెల 30వ తేదీన కుప్పంలో కృష్ణా జలాలకు చంద్రబాబు హారతి ఇవ్వనున్నారన్నారు. హంద్రీ - నీవా జలాలతో కుప్పం సస్యశ్యామలం కానుందని వివరించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని శుక్రవారం డిల్లీలో చంద్రబాబును కలిసి ప్రశంసించారు. రాయలసీమ ప్రాంతంలోని ప్రతి ఆయకట్టుకూ నీరందించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలియజేశారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు





ఆలయం వెనుక భాగంలో రంగవల్లులు - సిద్ధమవుతున్న శివలింగం విద్యుత్ కటౌట్

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

కాణిపాకంలో మరో రెండ్రోజుల్లో పూర్తి కానున్న పనులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను శరవేగంగా చేస్తున్నారు. ప్రధాన ఆలయ గోపురానికి విద్యుత్ దీపాలంకరణ పనులు పూర్తయ్యాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల పనులు 90శాతం పూర్తిచేశారు. ప్రధాన, అనుబంధ ఆలయాలకు రంగులు వేసే పనులు ముగిశాయి. మిగిలిన పనులు మరో రెండ్రోజుల్లో పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ శాఖ ఈఈ వెంకటనారాయణ, సిబ్బంది కృషి చేస్తున్నట్లు ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలియజేశారు.



రాజగోపురానికి విద్యుత్ దీపాలంకరణ పనులు

బార్ లైసెన్సులకు దరఖాస్తులు నిల్

చిత్తూరు సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బార్ లైసెన్స్‌ల దరఖాస్తుల బోణీ కాలేదు. ఈనెల 18వ తేదీన ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్, ఈఎస్ శ్రీనివాస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఐదు రోజులు గడుస్తున్నా ఒక్క దరఖాస్తూ రాలేదు. మరోవైపు శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు అమావాస్య ఉండటంతో దరఖాస్తులు రాలేదని సమాచారం. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారికి 4వ శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవు కారణంగా బ్యాంకు లావాదేవీలు చేయలేరు. మిగిలింది సోమవారం, మంగళవారం మాత్రమే. ఈ రెండ్రోజులు అత్యధిక దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 7, కుప్పం, నగరి, పుంగనూరు, పలమనేరు మునిసిపాలిటీలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 11 బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో గీత కులాలవారికి 50శాతం రాయితీతో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఒక బార్ కేటాయించారు. ఒక్కో బార్‌కు రూ.5.10 లక్షలు తిరిగిరాని దరఖాస్తు రుసుంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ, 28వ తేదీ ఉదయం 8గంటలకు కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా బార్‌ల కేటాయింపు ఉంటుంది. జిల్లాలో ఒక వ్యక్తి ఎన్ని బార్‌లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు, ఎన్ని లైసెన్స్‌లైనా పొందవచ్చు. గీత కులాల వారికి ఈనెల 20 నుంచి 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను ఆహ్వానించారు. వీరికి 30వ తేదీన ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా బార్ కేటాయిస్తారు. ప్రతి దరఖాస్తుతోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఓటర్ ఐడీ/ డ్రైవింగ్ లైసెన్స్ / పాస్ పోర్టు/ బ్యాంక్ పాస్‌బుక్/ ఆధార్ కార్డు ఏదైనా సమర్పించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను వేలూరు రోడ్డులోని దుర్గమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో సమర్పించవచ్చు.

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే



కోర్టు వద్ద టీడీపీ నేతలతో ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగసు 22 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విచారణకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో పాటు 12 మంది టీడీపీ నేతలు శుక్రవారం చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు.వైసీపీ పాలనలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 2023 సెప్టెంబరు 11వ తేదీన కాణిపాక పట్నం సమీపాన కొంతమంది రోడ్డు పక్కనున్న చెట్లను కోసి రోడ్డుపై పడేయగా, ఓ యువకుడు ద్విచక్రవాహనంలో వస్తూ ప్రమాదానికి గురై మృతిచెందాడు. దీనిపై తవణంపల్లె పోలీసులు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్‌తో పాటు స్థానిక టీడీపీ నేతలు గోపి, నిరంజన్, గణేష్, పవన్ కుమార్, డిల్లీ, జగపతి, డిల్లీ యాదవ్, యుగంధర్, హరిప్రసాద్, హరీష్, లవకుమార్, దిలీప్ కుమార్‌లపై కేసు బనాయించి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు శుక్రవారం చిత్తూరు 8వ అదనపు జిల్లా కోర్టులో వాయిదా ఉండగా న్యాయమూర్తి శ్రీదేవి ఈ కేసును అక్టోబరు 6వ తేదికి వాయిదా వేశారు. ఇదిలా వుండగా ఈ కోర్టుకు నూతనంగా ఏపీపీగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతిరామ్ తాను ఏపీపీ కాకమునుపు ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకుల తరపున కేసు వాదించానని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఈ కేసుకు సంబంధించి వేరొకరిని ఏపీపీగా నియమించే అవకాశం ఉంది.



చిత్తూరులో శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో ఆకాశంలో మేఘాల మధ్యలో కన్పించిన గుండ్రని ఆకారం చూపరులను ఆకర్షించింది. అది ప్రయాణించిన మార్గంలో శుక్రవారం బలమైన వర్షాలు కురిశాయి.

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పులకు దరఖాస్తు చేసుకోండి

దివ్యాంగ విద్యార్థులకు సూచన

చిత్తూరు అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9, 10 తరగతులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయకుడు వినోద్ సూచించారు. ఈ నెల 31వ తేదీలోగా https\\depwd.gov.in.\en\schlorships వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పు, టాప్‌క్లాస్ ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్పుల కోసం ఇదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కలెక్టర్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

కేసు నమోదు చేసిన పోలీసులు



చిత్తూరు అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేసి, డబ్బులు డిమాండ్ చేయడంపై శుక్రవారం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. కలెక్టర్ పేరుపై గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ ఐడీని క్రియేట్ చేశాడు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులను ఈ ఐడీ ద్వారా పరిచయం చేసుకున్నాడు. అనంతరం వారిని డబ్బులు అడగటం మొదలుపెట్టాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. విషయం తెలుసుకున్న కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందు మీ ఇళ్లకు అమర్చుకోండి

'సూర్యఘర్' పథకంపై విద్యుత్ అధికారులకు ఎస్ఈ సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'సూర్యఘర్' పథకం కింద సోలార్ ప్యానెళ్లను ముందు విద్యుత్ శాఖ అధికారుల ఇళ్లకు అమర్చుకోవాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సూచించారు. శుక్రవారం చిత్తూరు గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. తొలుత విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు సోలార్ ప్యానెళ్లు పెట్టుకుంటే వినియోగదారులు ఆసక్తి చూపుతారన్నారు. అలాగే నెలకు 300 యూనిట్లు దాటిన ఓసీ, బీసీ వినియోగదారులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. బీసీలకు ప్రభుత్వం అదనంగా రూ.20వేల సబ్సిడీ ఇస్తోందనే విషయాన్నీ తెలియజేయాలన్నారు. వర్క్ ఆర్డర్లు పూర్తికాని ఏఈలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఏఈలకు ఆదేశాలిచ్చారు. బిల్లులు వసూళ్లు వంద శాతం చేయాలని, ప్రతి నెల ఐదో తేదీలోపు బిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

వర్షం



చిత్తూరు ఎస్పీఎస్ డిగ్రీ కళాశాల వద్ద వర్షం

చిత్తూరు కల్చరల్,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు, సోమల ప్రాంతాల్లో శుక్రవారం వర్షం కురిసింది.సదుం, కల్లూరు ప్రాంతాల్లో జల్లులకే పరిమితమైంది.చిత్తూరులో సాయంత్రం దాదాపు గంటసేపు కురిసిన వర్షంతో వాహనదారులతో పాటు స్కూళ్ల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పుంగనూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడని భార్య పురుగుల మందు తాగి మృతిచెందిన సంఘటన పుంగనూరు మండలంలో శుక్రవారం జరిగింది. కుంటుబ సభ్యుల కథనం మేరకు... పుంగనూరు మండలంలోని వనమలదిన్నె గ్రామానికి చెందిన భాస్కర్ భార్య దుర్గ(34) పిల్లలను మందలిస్తుండగా ఆమె భర్త మండిపడ్డాడు. దీంతో ఇంట్లోనే ఉండిన పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మట్టి వినాయకుడే పర్యావరణ హితుడు



మట్టి వినాయకుల తయారీని పరిశీలిస్తున్న అనసూయ తదితరులు

కుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మనం చేసే పండుగైనా, పబ్బమైనా పర్యావరణ హితంగా ఉండాలని కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ. చిదంబరం అన్నారు. చరిష్మా గ్రామీణ అభివృద్ధి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు అనసూయ సహకారంతో కళాశాలలో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. మట్టి వినాయకులను తయారు చేయించి తద్వారా కాలుష్య రహితంగా వినాయక చవితిని ఎలా నిర్వహించుకోగలమో వివరించారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో సహా మరే ఇతర కృత్రిమ పదార్థాలతో తయారు చేసే వినాయక ప్రతిమల వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కాలువ, చెరువు మరే ఇతర నీటి వనరుల్లో ఈ విగ్రహాలను ముంచినా అవి పూర్తిగా కరగకపోగా దానికి వాడే రంగులు, పదార్థాలు నీటిలో కలిసి నీరు, అది ప్రవహించే భూమి కూడా విషపూరితమవుతుందని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజలకు వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ ప్రతినిధి మహేశ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.నారాయణమూర్తి, అధ్యాపకులు ప్రదీప్ కుమార్, రాజ్యలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

పరమసముద్రం చెరువు పరిశీలన



పరమసముద్రం చెరువును పరిశీలిస్తున్న ప్రతాప్, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన నేపథ్యంలో కుప్పం మండలం పరమసముద్రం చెరువును శుక్రవారం రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావులు పరిశీలించారు. హంద్రీ-నీవా కాలువ నీటిని విడుదల చేసి ముందుగా పరమసముద్రం చెరువును నింపనున్నారని, ఇందుకోసం త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో పర్యటించనున్నారని ఇటీవల జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, హెచ్ఎన్ఎస్ ఎస్ఈ విటల్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. వారు పరమసముద్రం చెరువును పరిశీలించి ఇక్కడే సీఎం జలహారతి ఇవ్వనున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే రెస్కో చైర్మన్ ప్రతాప్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ ఈ చెరువును పరిశీలించారు. జల హారతి ఇవ్వాల్సిన ప్రదేశం, తర్వాత సభ ఏర్పాటు చేయాల్సిన స్థలాల ఏర్పాటు గురించి మున్సిపల్ అధికారులతో చర్చించారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో మెరుగైన వసతుల కల్పన



మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజలో ఆంజనేయరెడ్డి తదితరులు

రామకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యాలయాల్లో వసతుల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు తెలిపారు. శుక్రవారం రామకుప్పం పట్టణ శివార్లలోని డా.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మరుగుదొడ్ల సముదాయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కో-ఇన్‌చార్జి నవీన్, బీజేపీ జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి రాజసింహ, నేతలు టీవీరవి, పద్మనాభరెడ్డి, కొల్లుపల్లెవిజయ్‌కుమార్, వెంకటరమణ, విజయ్‌కుమార్‌రెడ్డి, కేశవరెడ్డి, భానుమూర్తి, శ్రీనివాసులు, ఆదిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణభగవానుడి ఊరేగింపు



శివరాపురంలో శ్రీకృష్ణభగవానుడి ఊరేగింపు

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం శివరామపురంలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. వేడుకలు ముగింపు సందర్భంగా శ్రీకృష్ణభగవానుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పులహోరు మధ్య ఊరేగింపు శివరామపురం నుంచి నంజంపేట, గట్టూరు గ్రామాల్లో కొనసాగింది. భక్తులు అడుగడుగునా స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పవన్‌కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శారద, భారతీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ రాము

పుంగనూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల్లోనే భూసమస్యలు పరిష్కరిస్తున్నట్లు పుంగనూరు తహసీల్దార్ రాము తెలిపారు. శుక్రవారం మోదుగులపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల భూసమస్యలు తెలుసుకున్నారు. 23న రాగానిపల్లె, మేలుపట్ల, 26న కుమ్మరనత్తం, 28న గుడిసిబండ, ఏతూరు, 29న బండ్లపల్లె, నెక్కుంది, 30న అరడిగుంట, మేలుందొడ్డి, 2న మాగాండ్లపల్లె, వనమలదిన్నె, 3న ఏటవాకిలి, మంగళం గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలోనే సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ ఫణి కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నన్ను అనాథలా వదిలేస్తారా?

● కుప్పం గ్రంథాలయం గోడు



హాకర్ల వెనుక బిక్కుబిక్కుమంటున్న కుప్పం ప్రభుత్వ గ్రంథాలయం



చాలీచాలని వరండాలో పాఠకుల పఠనం

కుప్పం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): 'నా వైపు ఎప్పుడైనా వచ్చారా? అసలు నేనెవరో మీకు తెలుసా? నేను కుప్పం పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని. గొప్పగా చెప్పాలంటే విజ్ఞాన భాండారాన్ని. మహానుభావుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు గ్రంథాల యోద్యమాన్ని ప్రారంభించి, నిర్వహించి నాలాంటి గ్రంథాలయాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. పూర్వం ఎందరో విద్యార్థులు నాలోని గ్రంథాలను చదివి విజ్ఞానాన్ని సముపార్జించారు. విజ్ఞాన ప్రదాతనైన నేను.. నా గురించి చెప్పుకోవడం సిగ్గుగా ఉంది. ఇప్పుడు నన్ను పట్టించుకునేవారే లేరన్న దిగులు కూడా తొలగిచేస్తోంది. ఎప్పటిదో పాతకాలం నాటి చిన్నపాటి ప్రభుత్వ భవనంలో ఎప్పటి నుంచో నన్ను కుదించేశారు. ఇప్పుడు పెద్దగా గ్రంథాలు కొనుగోలు చేయడంలేదు.. గతంలో కొన్నవి, ఎవరెవరో కానుకగా ఇచ్చినవి బోలెడు గ్రంథాలు ర్యాకుల్లో సర్దడానికి చోటులేక అట్టపెట్టెల్లో, మూటల్లో మూలన పడి ఉన్నాయి. పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో తెలియని ఉరుస్తున్న పైకప్పు కింద బిక్కుబిక్కుమంటూ ఇన్నాళ్లూ బతుకీడుస్తూ వచ్చాను. ఇప్పుడీ దిక్కుమాలిన బతుకు కూడా దక్కేలా లేదు నాకు.

ఆర్టీసీ బస్టాండు సమపంలో నేతాజీ రోడ్డును ఆనుకుని నా ఉనికి తెలియకుండా హాకర్లు ముందు భాగాన్ని ఆక్రమించేశారు. సరే.. దీన్ని కూడా తట్టుకున్నాను. అయితే ఇప్పుడు నేను తలదాచుకుంటున్న ఈ పాడుబడిన భవనాన్నీ కూల్చేస్తారట. నేతాజీ రోడ్డు విస్తరణ పనులు చేసి తీరాలట. కడ పీడీ వికాస్ మర్మత్ ఈ విషయంలో 'తగ్గేదే లే' అంటున్నారు. నిజమే, ఆయన చెబుతున్నట్టు రోడ్లు వెడల్పు చేస్తే మున్సిపాలిటీకి అందమొస్తుంది. ప్రజలకు సౌకర్యం ఎక్కువవుతుంది. అయితే నా గతి? నన్ను పట్టించుకునేవారే లేకుండా పోయారు. ఉన్న ఈ పాడుబడ్డ బిల్డింగ్ కూడా విస్తరణ పరిధిలోకి వెళ్లి కూల్చివేస్తే నేను నేనెక్కడ తలదాచుకోవాలి.

నా బిడ్డలైన వేలకు వేల గ్రంథాలను ఏ గంపకింద మూసి కాపాడుకోవాలి? నన్ను ప్రస్తుతమున్న ఆర్టీసీ బస్టాండు కాంప్లెక్సులో ఒక గదిలోకి మారుస్తామని పీడీ అంటున్నారని నా దగ్గరకు వచ్చే వృద్ధ పాఠకుల నుంచి తెలుసుకున్నా.. అయితే ఆ పాత ఆర్టీసీ కాంప్లెక్సు దెయ్యాల కొంపలా ఉంటుంది. ఈ గ్రంథాన్నింటినీ తీసుకెళ్లి అక్కడున్న ఏదో ఒక గదిలో ఉంచితే అసలే పాడైపోయిన పుస్తకాలు మరింత పాడై, ఒక్కటీ నాకు దక్కకుండా పోతుంది. మరో ఇబ్బంది ఏమిటంటే.. ఆర్టీసీ బస్టాండు అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయట. అప్పుడు మళ్లీ నన్ను ఆ కాంప్లెక్సునుంచి వేరే చోటకు మార్చాల్సిందేగా. ఎక్కడికి మారుస్తారు? ఎవరు నా గోడు వింటారు?

అధికారులారా, ప్రజాప్రతినిధులారా నన్ను కాస్త పట్టించుకోండి.



చాలని ర్యాకుల్లో ఉరుస్తున్న పైకప్పు కింద పాడైపోతున్న గ్రంథాలు

మీకు నేనంటే చులకన భావం ఉండొచ్చు. మీలో చాలామంది అసలు నేనొకదాన్ని ఉన్నానని తెలియకుండా పోవచ్చు. అయితే ఒకప్పుడు మీ తాత ముత్తాతల కాలంలో బాగా బతికినదాన్ని. ఈ టీవీలు, మొబైళ్లు రాక ముందు ప్రపంచ విజ్ఞానాన్ని పంచినదాన్ని. మీలో చాలామందికి పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్ ఇచ్చి, వెన్నుతట్టి ప్రోత్సహించిన మీ శ్రేయోభిలాషిని. ఇప్పటికే అనాథలా మిగిలిన నన్ను కాస్త పట్టించుకోండి. నాకో కనీసమైన శాశ్వత చిరునామా కల్పించండి. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో ఎన్నో భవనాలను ఇప్పటికే నిర్మించారు. కడా కార్యాలయం ఉన్న ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ భవనం కూడా సమీపంలోనే ఉంది. నాకు అందులో ఒక రెండు గదులు కేటాయించండి. లేదు, అక్కడ పెద్దపెద్ద ఆఫీసులే ఉండాలంటారా.. మరి ఇంకెక్కడైనా కాస్త నా బిడ్డలైన గ్రంథాలకు సరిపడే భవనాన్ని చూపండి.. నన్ను అనాథలా వదిలేయకండి. మీకు పుణ్యముంటుంది.. ఈ మేలు చేయండి. నా గోడు కాస్త పట్టించుకోండి.

ఇట్లు
కుప్పం ప్రభుత్వ గ్రంథాలయం

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గంగవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద సంఘటనలలో రక్షించే విధానంపై పలమనేరు ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో సమీపంలోని పరాగ్ పాల డెయిరీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, పల్నాడు జిల్లా అధికారి బాలరాజు, పలమనేరు, పుంగనూరు ఫైర్ ఆఫీసర్లు మనోగరణ్, సుబ్బరాజు, సిబ్బంది రెడ్డెప్పరెడ్డి, సుమన్, శివరాజ్‌లతోపాటు డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



రోగులకు పాలు, పండ్ల పంపిణీ చేస్తున్న హోటల్ మురళీ

చౌడేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం చౌడేపల్లెలో ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమాని హోటల్ మురళి ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, పాలు, పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చరణ్, జావీద్, కాలేషా, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల అభివృద్ధే లక్ష్యం



విత్తనాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం రైతులకు రాయి తీ విత్తనాలను అందిస్తోందని పశువైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో పాడి రైతులకు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రాయితీ మొక్కజొన్న, ఎర్రజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహ్మద్‌గని, కుమార్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఘనస్వాగతం



చౌడేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి చౌడేపల్లె టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం సోమల ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకార మహోత్సవానికి వెళుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిలను బోయకొండ మాజీ కమిటీ సభ్యులు జంపాల శ్రీనివాసులు నాయుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులు బస్టాండులో పూలమాలలు వేసి, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహ్మద్‌గని, వెంకటరమణ, రెడ్డప్ప, దాము తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవాలని వినతి



తహసీల్దారును సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

రామకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని అట్టడుగువర్గాల వారికి అండగా నిలవాలని మండల ఎమ్మార్పీఎస్ నేతలు తహసీల్దారు కౌలేష్‌ను కోరారు. ఎమ్మార్పీఎస్ మండల కొత్త అధ్యక్షుడు విజయ్‌కుమార్ నేతృత్వంలో పలువురు నేతలు శుక్రవారం మండల సచివాలయంలో తహసీల్దారును కలిసి సత్కరించారు. నేతలు రాఘవేంద్ర, వెంకటేశ్, జయప్ప పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటప్రసాద్

రామకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యపరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కుష్ఠు, టీబీ జిల్లా అధికారి వెంకటప్రసాద్ ఆరోగ్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రామకుప్పం మండల సచివాలయ సమావేశమందిరంలో రామకుప్పం, విజలాపురం, వీర్నమల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెరుగైన చికిత్సలు అందించాలన్నారు. వైద్యాధికారులు లోకేష, పూజితచ శశిధర్, సీహెచ్ఓ మస్తాన్‌బాషా, హెచ్ఏ బాలయ్య, పలువురు ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకానికి రోజుకు రూ.6 కోట్ల భారం

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సోమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్త్రీశక్తి పథకంలో మహిళల కోసం రోజుకు రూ. 6 కోట్ల వ్యయం ప్రభుత్వం భరిస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సోమల ఏఎంసీ, సింగిల్ విండో పాలకవర్గం ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు సోమల బస్టాండు నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలను వృథాగా పోకుండా ఉండేందుకు ఆ నీరును హంద్రీనీవా కాలువకు మళ్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో రూ.530 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఎన్నికల హామీని చంద్రబాబు నెరవేర్చడంతో ప్రజలకు తాగునీరు, సాగునీరు కష్టాలు తీరుతాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పాల రైతులు, మామిడి రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు పెట్టిన అక్రమ కేసులతో జైళ్లకు వెళ్లారని.. వందలాది మంది కుటుంబాలు నిద్రలేని రాత్రులు గడిపారన్నారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌లను మంత్రి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, జనసేన మండలాధ్యక్షుడు నాగభూషణం, టీడీపీ నాయకులు ముల్లంగి రమణ, ఉయ్యాల రమణ, జనార్దన్, హరిప్రసాద్, బోస్, వేణుగోపాల్‌నాయుడు, ఉమాపతి నాయుడు, అష్రఫ్ అలీ, సతీశ్, కైవారం మురళీ, రమేశ్‌నాయుడు, భానుప్రకాశ్, విశ్వనాథం, గువ్వల రమేశ్‌రెడ్డి, మహేంద్రబాబు, చాణుక్య, బాబురావ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వయోవృద్ధులకు అండగా కూటమి ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు అందిస్తోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం పలమనేరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అర్హులైన వికలాంగులు, వృద్ధులకు రూ.71.31 లక్షల విలువైన 1078 (ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్స్) పరికరాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది డిసెంబరులో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి అర్హులైన వారికి పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులై ఉండి ఎంపిక కానట్లయితే తన దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో నటనలో ఎన్టీఆర్ తరువాత అంతటి ప్రాముఖ్యం పొందిన జన అభిమాని చిరంజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో భవాని, దివ్యాంగుల సంక్షేమ సంఘం సహాయ సంచాలకులు వినోద్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, నాయకులు కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు, ఖాజా, మదన్ కిరణ్, బీఆర్సీ కుమార్, జనసేన దిలీప్, నాగరాజు తోపాటు పలువురు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దయ్యేవరకు పోరాటం



సీపీఎస్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీసీపీఎస్ఈఏ నాయకులు

సదుం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దయ్యే వరకు తమ పోరాటం ఆగదని ఏపీసీపీఎస్ఈఏ చిత్తూరు జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ కోరుతూ సెప్టెంబర్ 1న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమ ప్రచార పత్రాలను శుక్రవారం పాఠశాల మధ్యాహ్న భోజన విరామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మోహన్ రెడ్డి, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు కిశోర్, వినోద్, కమలహాసన్, కిశోర్ రెడ్డి, కృష్ణమూర్తి, వెంకటరమణ, శ్రీరాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ప్రముఖులు

కుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని రామచంద్ర రోడ్డులో గల బ్రహ్మకుమారీస్ రాజయోగ శిక్షణ కేంద్రంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రక్త నిధి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రాజయోగిని డాక్టర్ ప్రకాశమణి దాదీజీ 18వ పుణ్య స్మృతి దినం, విశ్వ బంధుత్వ దినం పురస్కరించుకుని నిర్వహించినట్లు బ్రహ్మ కుమారీస్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు. పలువురు పట్టణ ప్రజలు రక్తదానం చేశారు.

సృజనాత్మకత, సాంకేతికతల కలయికతో విజయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీసీఎన్ తదితరులు

కుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతతో సాంకేతికత కలిస్తేనే భవిష్యత్తు ఘన విజయాలు సాధ్యమవుతాయని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెసిన్ లెర్నింగ్ (సీఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బీసీఎన్ మాట్లాడుతూ సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానాలకు కఠిన శ్రమ, క్రమశిక్షణ తోడవ్వాలన్నారు. అప్పుడే అందమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చని చెప్పారు. ఈసెట్ కన్వీనర్, జేఎన్టీయూ అకడమిక్ ఆడిట్ కన్వీనర్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయి సాంకేతిక సదస్సుల ప్రాముఖ్యతను వివరించారు. ఇలాంటి సదస్సులు విద్యార్థుల జ్ఞానాన్ని విస్తరించడమే కాక పరిశోధన, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఇతర కళాశాలల విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని తమలోని ప్రతిభను వెలికి తీసుకురావాలని సూచించారు. వివిధ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీఎస్ఈ విభాగాధిపతి ఎ.రవీంద్ర కుమార్, సదస్సు కన్వీనర్‌గా వ్యవహరించగా, జాఫర్, అశోక్‌రెడ్డి, తనూజ, సౌజన్యలు నిర్వహణలో ఆయనకు సహకరించారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఇతర విభాగాధిపతులు, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ నుంచి విచ్చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడ బిడ్డను కాపాడుకుందాం: ఆర్డీవో

చిత్తూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆడ బిడ్డను కాపాడుకుందాం.. లింగ నిర్ధారణ పరీక్షలను అడ్డుకుందామని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో లింగ వివక్షత నిర్మూలనపై వివిధశాఖల అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమించిన ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకు భ్రూణహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. విద్యతోపాటు కళలు, క్రీడలు, సాంకేతిక రంగాల్లో బాలికలు రాణించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

నగరిలో వీధి కుక్కల బెడద తప్పినట్లే..!


వీధి కుక్కలను పట్టుకెళుతున్న సిబ్బంది

నగరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద తప్పినట్లే. మానవహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జ్యోతి నాయుడు ఫిర్యాదుతో నగరిలో శుక్రవారం వీధి కుక్కలను పట్టారు. ఆపై వీటిని తిరుపతి యానిమల్ కేర్ లాండ్‌కు తరలించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం తెలిపారు.

పాఠశాల ప్రహరీ వద్ద దుకాణాలు తొలగించండి

● ఎస్ఐకి ఫిర్యాదు చేసిన పూతలపట్టు హైస్కూల్ కమిటీ చైర్మన్

పూతలపట్టు, ఆగసు 22 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద అక్రమంగా ఏర్పాటుచేసిన దుకాణాలను తొలగించాలని ఎస్ఐ కృష్ణమోహన్‌కు స్కూల్ కమిటీ చైర్మన్ నేతాజీ శుక్రవారం ఫిర్యాదు చేశారు. అదీగాక ప్రహరీ వద్ద వ్యర్థాలను పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దీనివల్ల విద్యార్థులకు అంటురోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీకృష్ణుడి పల్లకీ సేవలో ఎమ్మెల్యే మురళీమోహన్



బంగారుపాళ్యం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక బంగారుపాళ్యం కమిటీ ఆధ్వర్యంలో బంగారుపాళ్యం రాజావీధిలో వారం రోజులుగా కృష్ణాష్టమి వేడుకలు జరుగుతున్నాయి. చివరి రోజైన శుక్రవారం పాలేరు గ్రామంలో శ్రీకృష్ణుడి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సేవలో ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, సీఐ శ్రీనివాసులు, నేతలు రాధాకృష్ణమనాయుడు, గురుజాల సురేంద్రనాయుడు, మంజునాథ్, నిర్వాహకులు బాలాజి, మునిరత్నం, సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి


నాగభూషణం నాయుడు

చిత్తూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తన భూ సమస్యను పరిష్కరించాలని ఐరాల మండలం పందిగుట్టూరుకు చెందిన నాగభూషణం నాయుడు విన్నవించారు. ఈమేరకు శుక్రవారం చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తనకు తాతల నుంచి సంక్రమించిన భూమిని కొందరు అక్రమంగా 1బీలోకి ఎక్కించుకున్నారని ఆరోపించారు. వారి వద్ద ఆ భూమిని ఇప్పించి తనపేరిట 1బీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కలెక్టర్‌కు ఇప్పటికే అనేకమార్లు ఫిర్యాదు చేశామన్నారు. సర్వేయర్‌కు గ్రౌండ్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై చిత్తూరు ఆర్డీవో వివరణ కోరగా.. నాగభూషణం నాయుడు పేరుతో 30 సెంట్లు తప్ప వేరే భూమి ఉన్నట్లు రికార్డులు లేవన్నారు. పైగా ఆయన ఆరోపిస్తున్న భూమిలోకి ఎవరూ రావడానికి అనుమతి లేదని ఆ యజమానులు కోర్టును నుంచి ఆర్డర్ పొందారన్నారు. అయినా సర్వే చేయించామని, ఆ భూమి నాగభూషణం అనుభవంలో లేదని తేలిందన్నారు.

మందుబాబులకు రూ.1.16 లక్షల జరిమానా

నగరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో తాగడం వంటి కేసుల్లో 26 మంది పట్టుబడ్డారు. వీరిని నగరి మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరుపరచగా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జానకి.. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 10 మందికి రూ.లక్ష, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 16 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.16వేల జరిమానా విధించారు. మొత్తం రూ.1.16 లక్షల జరిమానా విధించారని సీఐ విక్రమ్ తెలిపారు.

కలెక్టర్ చొరవతో ఆస్పత్రి పనులు వేగవంతం


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెనుమూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం కాంట్రాక్టర్‌తో కలిసి ఎస్ఈ చిరంజీవులు, ఈఈ శివరామిరెడ్డి, డీఈ లోకేష్‌రెడ్డిలు భవన నిర్మాణాన్ని పరిశీలించారు. 2022లో మొదలుపెట్టినా పునాదులకే పరిమితమవ్వడం గమనించి నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ లేబర్ రిపోర్టు కలెక్టర్‌కు పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీధర్‌బాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి లోకనాథనాయుడు, రాజగోపాల్‌నాయుడు, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో

నిందితుడి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

వెదురుకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఎస్ఆర్‌పురం మండలం పిల్లారికుప్పం కాలనీలో జగన్నాథం పాతకక్షల నేపథ్యంలో గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బైక్‌పై వెళుతున్న మునస్వామిని ఢీకొట్టడంతో గాయపడ్డాడు. తర్వాత ఆయన ఇంటి గేటు, ప్రహరీని ట్రాక్టర్‌తో ఢీకొట్టి ధ్వంసం చేశాడు. ప్రస్తుతం మునస్వామి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడు జగన్నాథాన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

బాధితుడి కుటుంబానికి అండగా ఉంటా: టీడీపీ

హత్యాయత్నంలో గాయ పడిన టీడీపీ నాయకుడు మునస్వామి కుటుంబానికి అండగా ఉంటామని చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు సీఆర్‌రాజన్ తెలిపారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునస్వామిని, ఆయన కుటుంబీకులను శుక్రవారం పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు వేమానాయుడు, జయచంద్రనాయుడు, జ్యోతిప్రకాష్ (ఎస్ఆర్‌పురం), వాసునాయుడు (పాలసముద్రం), చిట్టిరెడ్డి (జీడీనెల్లూరు) ఉన్నారు.


మునస్వామిని పరామర్శిస్తున్న సీఆర్ రాజన్, టీడీపీ నాయకులు

భయం.. భయంగా చదువులు

పాఠశాల భవనం పెచ్చులూడి పడుతుండటమే కారణం

బంగారుపాళ్యం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శేషాపురం ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు భయం.. భయంగా చదువులు సాగిస్తున్నారు. అప్పటికీ ఓ మూలన కూర్చొంటున్నారు. అయినా ఎప్పుడు ఎవరిపైన పెచ్చులు పడతాయోనని భయపడుతూనే ఉన్నారు. ఈ బడిలో 23 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అధికారులు ఈ భవనాన్ని వెంటనే మరమ్మతులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మూల్యాంకన పుస్తకాల విధానం మార్పు చేయాలి: ఏపీటీఎఫ్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మూల్యాంకన పుస్తకాల విధానం మార్పు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ కోరారు. శుక్రవారం విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరావును సంఘ నాయకులతో కలిసిన ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. కొత్త విధానం బోధన సమయాన్ని హరించి వేయడమే కాకుండా పలు సమస్యలకు కారణమవుతుందని చెప్పారు. విద్యార్థులు వందలాది పుస్తకాలు ఇంటికి మోసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. నాయకులు ముక్తార్, నవీన్, జగదీష్, ప్రభాకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



జానపద కళలు.. పల్లెల ప్రతిరూపాలు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జానపద కళలు.. పల్లెల ప్రతిరూపాలని పీవీకేఎన్ ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అన్నారు. శుక్రవారం కళాశాలలో అంతర్జాతీయ జానపద దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నవ సమాజాన్ని చైతన్య పర్చడానికి జానపద కళలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. జానపద కళాకారుడు రెడ్డెప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలపై ఖాతాదారులకు అవగాహన

యాదమరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంకు ద్వారా అందే రుణాలపై ఖాతాదారులకు గురువారం యాదమరి పీఏసీఎస్‌లో అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ చిత్రా నాయుడు నేతృత్వంలో జరిగిన సమావేశంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ లిల్లీ కేథరిన్ మాట్లాడుతూ.. ఏయే రుణాలు అందుబాటులో ఉన్నాయో తెలిపారు. డీసీసీబీ మేనేజర్ సి.ఆర్.రఘుబాబు, సూపర్‌వైజర్ టి.ధనుంజయ రెడ్డి, సహకార సంఘ సభ్యులు మహబూబ్ బాషా, ప్రభాకర్, సీఈవో గుణశేఖర్, బంగారుపాళెం మార్కెట్ కమిటీ సభ్యులు హరి నాయుడు, జ్యోతి మోహన్, నేతలు హేమగిరి, వల్లేరి అమరనాథనాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి విద్యార్థులు ఎదగాలి


ధ్రువపత్రాలతో విజయం బిజినెస్ స్కూల్ విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి పిలుపునిచ్చారు. మై భారత్ అంశంలో భాగంగా శుక్రవారం విజయం బిజినెస్ స్కూల్ ప్రాంగణంలో స్టార్టప్ ఇండియాపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. వ్యాపార రంగంలో ప్రభుత్వాలు అందజేస్తున్న రాయితీలను బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న విద్యార్థులు గమనించాలన్నారు. మైభారత్ తరఫున నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్, జిల్లా పరిశ్రమల మేనేజర్ సూరిబాబు, లీడ్ డిస్ట్రిక్‌మేనేజర్ హరీష్, స్కూల్ ప్రిన్సిపాల్ జయంత్ ప్రసంగించారు. ప్రభుత్వాలిచ్చే ప్రోత్సాహకాలు, రుణాలు, వ్యాపారం ఎలా మొదలుపెట్టాలన్న అంశాలను తెలియజేశారు. మై భారత్ ప్రాంతీయ గణాంకాధికారి ఎంసీ బాబురెడ్డి, సిబ్బంది రాజకుమారి, నిత్యానందం, హరీష్ బాబు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గంగ పెట్టె ఊరేగింపు



వెదురుకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం బోడిబాపనగుంట సమీపంలోని కానగల అమ్మవారి ఆలయంలో తిరునాళ్లను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం తూర్పు వీధి భజన మందిరం నుంచి గంగపెట్టెను పురవీధుల్లో ఊరేగించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

నేడు రక్తదాన శిబిరం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సాంబయ్య కండ్రిగ ఓం శాంతి యోగా భవనంలో శనివారం ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు తెలిపారు.

పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు



యాదమరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డుకు పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు ఎంపికయ్యారు. ఈ అవార్డును డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ ద్వారా శుక్రవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. విద్యార్థులను శక్తివంతం చేయడంలో తమవంతు కృషి చేసిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తారు.

శ్మశానానికి స్థలం చూపాలని ధర్నా


ధర్నా చేస్తున్న ఆదిఆంధ్రవాడ వాసులు

విజయపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్మశానానికి స్థలం చూపాలని విజయపురం దక్షిణ ఆది ఆంధ్రవాడ వాసులు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. గతంలో ఉపయోగిస్తుండిన శ్మశాన స్థలాన్ని ఓ భూస్వామి ఆక్రమించేశాడని చెప్పారు. ప్రస్తుతం ఎవరైనా మరణిస్తే ఎక్కడ దహన క్రియలు చేయాలో తెలియడం లేదని వాపోయారు. అనంతరం తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రమిచ్చారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

నల్లరాళ్లపల్లెలో స్వామిత్వ సర్వే

గంగాధరనెల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లరాళ్లపల్లె రెవెన్యూలో శుక్రవారం స్వామిత్వ సర్వేని సచివాలయం అధికారులు నిర్వహించారు. ఈ పనులను ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో శివయ్య పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, అగరమంగళం పంచాయతీ కార్యదర్శి నాగప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

బంగారుపాళ్యం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ బాబు సూచించారు. తగ్గువారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఐవీ, మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర,అంగన్‌వాడీకార్యకర్త సూర్యకుమారి,ఆశావర్కర్ భువనేశ్వరి పాల్గొన్నారు.

సీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని వేగంగా చేయాలి: ఎస్ఈ


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈ

వెదురుకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్ఈ చిరంజీవులు తెలిపారు. శుక్రవారం కార్వేటినగరంలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని తనిఖీ చేశారు. పనులకు సంబంధించి సూచనలు, సలహాలను ఆ శాఖ ఉద్యోగులకు ఇచ్చారు.

ఆలయ ఈవోకు సన్మానం



శ్రీరంగరాజపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆరిమాని గంగమ్మ గుడి నూతన ఈవో వెంకట రాయల్‌ను శుక్రవారం 18 గ్రామాల ఆయకట్టు ప్రజలు, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి సన్మానించారు. రానున్న సంక్రాంతికి అమ్మవారిని గర్భగుడిలో ప్రతిష్ఠించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవోకు విన్నవించారు. సుబ్రహ్మణ్యం నాయుడు, హిమాచలపతిరెడ్డి, రఘుపతి నాయుడు, సిద్ధయ్య శెట్టి, జలంధర్ నాయుడు, చందు, బాలాజీ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి: ఆర్డీవో

నింద్ర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరి ఆర్డీవో అనుపమ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సర్వేయర్, వీఆర్వోలతో సమీక్షించారు. తహసీల్దార్ శేషగిరిరావు, డిప్యూటీ తహసీల్దార్లు మాధవి, లీలావతి, ఆర్ఐ ప్రభాకర్, మండల సర్వేయర్ వెంకటేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

వెదురుకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం కేజేపురం గ్రామ పంచాయతీ ఇందునగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని జడ్పీటీసీ అన్‌బాలగన్ శుక్రవారం తెలిపారు. నీటి సమస్య ఉండటంతో జడ్పీ నిధుల నుంచి రూ.5లక్షలతో బోరు డ్రిల్లింగ్ చేయించామని, విద్యుత్ మోటారు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సంక్షిప్తంగా..

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బంగారుపాళ్యం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు శుక్రవారం సీఐ శ్రీనివాసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వివాదాలకు దూరంగా ఉండాలని, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు న్యాయం

గుడిపాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి దివ్యాంగుడికీ న్యాయం చేస్తామని ఎంపీడీవో శిరీష తెలిపారు. శుక్రవారం మండలంలోని పది పంచాయతీల్లో పింఛను తొలగించిన దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించారు. వీరిలో అర్హులైన వారికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రశ్మిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ

వెదురుకుప్పం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఎంపీడీవో పురుషోత్తం శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి అల్పాహారం స్వీకరించి,ఇ మెనూను పరిశీలించారు. టీకేఎంపురంలో ఇంటింటి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మనదొడ్డ హౌసింగ్ లేఅవుట్‌లోని గృహ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. కార్యదర్శులు వెంకటేశు, హేమాద్రి, ఎంఎస్‌కే షైమావతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

'సింగిల్ విండోల అభివృద్ధికి సహకరించండి'

తవణంపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండోల అభివృద్ధికి సహకరించాలని డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని తవణంపల్లె, అరగొండ సింగిల్‌విండోల చైర్మన్లు అమరేంద్రనాయుడు, రంజిత్‌రెడ్డి కోరారు. శుక్రవారం చైర్మన్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, నేత ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

వెదురుకుప్పం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామీణ సాక్షరత మిషన్ ఆధ్వర్యంలో కార్వేటినగరం మండలం కొల్లాగుంట అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు శుక్రవారం బ్యాగులను పంపిణీ చేశారు. చేనేత కార్మిక యూనియన్ నాయకులు జి.షణ్ముగవర్మ, రామ్మోహన్, ఆకుల వాసు, చల్లా బాలాజీ, సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్ రోజారమణి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మమత పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు అనుమతివ్వండి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా ఆయన జీవితంపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు మధుసూదనం కోరారు. ఈ మేరకు డీఈవో వరలక్ష్మి, ఇంటర్మీడియట్ డీఐఈవో రఘుపతిని కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా సమన్వయకర్తలు శంకర్, గజేంద్ర, శేషనారాయణ, కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

రేపు నేత్ర వైద్య ఉచిత శిబిరం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాముల గుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం నేత్ర వైద్య ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు జైన్ సంఘం నాయకుడు సుభాష్ జైన్ తెలిపారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు


అభిమానులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మండి సుధ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఆర్ సర్కిల్‌లో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మెగా చిరంజీవి ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు మండి సుధ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రకాష్, శ్రీనివాసమూర్తి, బుజ్జి, అట్లూరి శ్రీనివాసులు, రాధాకృష్ణ, కుట్టి రాయల్, జీకే ఖాన్, శంకర్ రెడ్డి, మురళి, నాని, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో జరిగిన వేడుకల్లో జనసేన నేత, చిరుఫ్యాన్స్ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామినాథన్, అభిమానులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

గుడిపాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై అనుపు ఎస్టీకాలనీవాసులకు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ హిమగిరి అవగాహన కల్పించారు. శుక్రవారం కాలనీని సందర్శించి అక్కడున్న యానాదులతో మాట్లాడారు. ఆధార్ కార్డు లేనివారికి మంజూరు చేయిస్తామని చెప్పారు. ఎలక్షన్ ఆపరేటర్ కిరణ్, అర్బన్ ఆపరేటర్ ప్రభాకర్, వీఆర్వో సుప్రజ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వెదురుకుప్పం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):పచ్చికాపల్లం ఇండియన్ బ్యాంకులో శుక్రవారం 'ఖాతాదారుల దినోత్సవం' జరిగింది. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బీఎం నవీన్‌కుమార్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల బడిలోని టెన్త్ విద్యార్థులకు 'అమరరాజా' అవకాశం

● ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన నలుగురు బాలబాలికలకు ఉచితంగా సీట్లు


పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న గల్లా రామచంద్రనాయుడు

ఐరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు అమరరాజా కళాశాలలో ఉచితంగా సీట్లు ఇస్తామని అమరరాజా గ్రూప్స్ అధినేత గల్లా రామచంద్ర నాయుడు ప్రకటించారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన శుక్రవారం తాను చదువుకున్న బడిని పరికించి చూశారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో జరిగిన సరస్వతి పూజలో పాల్గొన్నారు. హెచ్ఎం వాసుదేవన్, కళాశాల ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డిలు మౌలిక వసతులు కల్పించాలని కోరగా రామచంద్రనాయుడు సానుకూలంగా స్పందించారు. త్వరలో నిర్వహించనున్న వజ్రోత్సవాలకు విచ్చేస్తానని చెప్పారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతి నాయుడు, ఉపాధ్యక్షుడు ఏపీ రాజేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు హరినాథగుప్తా, బద్రీనాథ్, సుకుమార్, సాయీశ్వర్‌రెడ్డి, చక్రవర్తిరెడ్డి, ఓంప్రకాష్, ఖయ్యూం బాషా, మన్యం శివ, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.